అభిప్రాయ సేకరణ పేరిట కాలయాపన

కమాన్‌పూర్: గుండారం రైతు వేదికలో వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు

- సకాలంలో రైతు భరోసా అందించాలి

పెద్దపల్లి/ సుల్తానాబాద్ రూరల్, జూన్ 25: అభిప్రాయ సేకరణ పేరిట రైతు భరోసాను సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కాలయాపన చేస్తున్నని అన్నదాతలు విమర్శించారు. వానకాలం పంట సాగుకు ముందే రైతు భరోసా ఇస్తే రైతులకు ఉపయోగపడుతుందని, అప్పుల బాధ తప్పుతుందన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతు భరోసా పథకం అమలుపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ గానూ వ్యవసాయ శాఖ మంత్రి తమ్మల నాగేశ్వర్ రావు, వ్యవసాయ శాఖ అదికారులు హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైతు వేదిక నుంచి పెద్దపల్లి నియోజక వర్గం రైతులు, జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి, నియోజక వర్గం వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. వీసీలో నియోజక వర్గం నుంచి ఒక రైతుకు మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. కేవలం రైతు భరోసాపై మాత్రమే మాట్లాడాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నత అధికారులు స్పష్టంగా చెప్పారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా జిల్లా వ్యవసాయాధికారికి అందించారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు పంపిస్తామని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు.

గుండారం రైతు వేదికలో

మంథని/కమాన్ పూర్, జూన్ 25: గుండారంలోని రైతు వేదికలో మంథని డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాలకు చెందిన రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి రాబోయే రైతు భరోసా స్కీం మార్గదర్శకాలు ఏ విధంగా అమలు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందనే అంశంపై రైతుల అభిప్రాయాలు సేకరించడంతో పాటు సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంథని, కమాన్ పూర్, రామగిరి, ముత్తారం మండలాల రైతులకు మాట్లాడే అవకాశం రాలేదు.కార్యక్రమంలో జిల్లా ఏడీఏ టెక్నికల్ కాంతారావు, ఏవోలు బండి ప్రమోద్ కుమార్, భూక్యా మోహన్, చిందం శ్రీకాంత్. ఏఈవోలు, నాలుగు మండలాల రైతులు పాల్గొన్నారు.

పాలకుర్తి, జూన్25: పాలకుర్తి రైతు వేదికలో జరిగిన వీసీలో రైతు భరోసాపై రైతుల సలహాలు సూచనలు, అభిప్రాయాలు సేకరించారు. సమావేశానికి హాజరైన రైతులు పలు తీర్మానాలు చేశారు. ఏడీఏ శ్రీనాథ్, ఏవోలు పూర్ణిమ, ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్ వాడీ కేంద్రాల అభివృద్ధి

పెద్దపల్లి, జూన్25: ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. అంగన్ వాడీ కేంద్రాల అభివృద్ధిపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ్ శ్రీ పాల్గొన్నారు. కలెక్టర్ శ్రీ హర్ష మాట్లాడుతూ, పోషక లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు దోహదపడే విధంగా పౌష్టికాహారం అందజేసేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోషక లోపం ఉన్న పిల్లలకు అదనంగా బాలామృతం అందిస్తున్నామని, మంచి ఫలితాలు కూడా వస్తున్నాయని, పిల్లలు సాధారణ స్థితికి చేరుకున్నారని కలెక్టర్ తెలిపారు.

పంటల నమోదు ప్రారంభించాలి

సుల్తానాబాద్‌రూరల్,జూన్ 25: సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో పంటల నమోదు ప్రక్రిమను వ్యవసాయ అధికారులు ప్రారంభించాలని జిల్లా వ్యవసాయ అధికారి అదిరెడ్డి అన్నారు. కాట్నపల్లి రైతు వేదికలో మంగళవారం పెద్దపల్లి నియోజక వర్గం ఏవోలు, ఏఈవోలతో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి సమావేశం నిర్వహించారు. భూసార పరీక్షలను నిర్వహించి పంటల ను వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏవోలు, ఏఈవోలు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జూన్25: డబుల్ బెడ్రూం సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. పెద్దపల్లిలోని కూనారం రోడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాన్ని మంగళవారం సందర్శించారు. పనుల పురోగతి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. చివరి దశ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సంప్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి మున్సిపల్ అధికారులకు అప్పగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ పైప్ లైన్ వేయాలని, ఈ పనుల ప్రతిపాదనలు రూపొందించి వెంటనే ప్రారంభించాలన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జేఅరుణ శ్రీ, పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ బొంకూరి సుదర్శన్, మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్ బీ ఇన్‌చార్జి ఈఈ నర్సంహాచారి, తహసీల్దార్ రాజ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, ఏఈ సతీశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రభుత్వ దవాఖానలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ దవాఖానలు, అందుబాటులో ఉన్న సిబ్బంది, ప్రసవాల సంఖ్య, అందుతున్న సేవలు, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కల్పిస్తున్న వసతులు, సేవలపై ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవలు పొందే దిశగా పనితీరు ఉండాలన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలనను పాటించాలని, సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. గర్భిణులు, మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్‌సీడీ సర్వే జిల్లాలో నాణ్యతతో నిర్వహించాలని, అవసరమైన వారికి మందులు అందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో కే ప్రమోద్ కుమార్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ రమాకాంత్, వైద్యాధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ

సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్, జూన్ 25:ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సుల్తానాబాద్‌లోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు గర్రెపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. దవాఖానలోని అన్ని వార్డులను తనిఖీ చేశారు. సబ్ సెంటర్ల వారీగా గర్భిణులు, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్, టీకాలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, సబ్ సెంటర్లలో ఓపీ, తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. దవాఖానలో మందుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు స్టాక్ పర్యవేక్షించాలని సూచించారు. డీఎంహెచ్‌వో కే ప్రమోద్ కుమార్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ , సుల్తానాబాద్ దవాఖాన సూపరింటెండెంట్ రమాదేవి, ఆర్ఎంవో మహేందర్, డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలను తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సుల్తానాబాద్‌తో పాటు మండలంలోని పలు పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించాలని ఆదేశించారు. ఎంఈవో సురేందర్, ఆయా పాఠశాలల హెచ్ ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్స్, ఏఏపీ పీఆర్‌లు, సంబంధిత అధికారులు ఉన్నారు.

సింగరేణి రక్షణకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 25 : సింగరేణి రక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధమని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 లో మంగళవారం ఆయన గేట్ మీటింగులో మాట్లాడారు. సింగరేణి రక్షణ కోసం రాజకీయ పార్టీలు ద్వంద్వ నీతిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకమాట, అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడటమే దీనికి నిదర్శమన్నారు. ఈ ప్రాంత వాసిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పెద్ద మనుస్సుతో సింగరేణిని రక్షించే చర్యలకు పూనుకోవాలని సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు స్వయంగా బొగ్గు వేలంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొనడం అన్యాయమన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని బొగ్గు పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో ఏఐటీయూసీ పెద్దన్న పాత్ర పోషిస్తు తమతో కలిసి వచ్చే కార్మిక సంఘాలతో ఉద్యమాన్ని చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు వైవీ రావు, రాంచందర్, డీటీ రావు, కే.రాజరత్నం, ఎల్. ప్రకాష్,కే. సమ్మయ్య, గంగాధర్, వెంకటస్వామి, కొమురన్న, మల్లేష్, కేవీఎన్ రెడ్డి, ఎం.నరేష్, శ్రీనివాస్, సంజీవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన ర్యాలీ

పెద్దపల్లిరూరల్, జూన్ 25: అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవూఫ్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ భవన సముదాయం వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ సమవేశ మందిరంలో అవగాహన సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, యువతీయువకులు, పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్ర

యైటింక్లయిన్ కాలనీ జూన్ 25 : సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నదని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు నర్సింహా రెడ్డి అన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కోల్ ఇండియా బొగ్గు బ్లాకులతోపాటు సింగరేణిలోని బొగ్గు బ్లాకులను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కుట్ర జరుగుతున్నదన్నారు. ఇందులో భాగంగానే ఇటీవల స్వయంగా ఆయన ఆధ్వర్యంలోనే బొగ్గు బ్లాకులు వేలం వేశారని తెలిపారు. దీన్ని గుర్తించి కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘంగా ఐఎన్‌టీయూసీ సింగరేణిలోని బొగ్గు బ్లాకులను సంస్థకు అప్పగించాలని విన్నవించినట్లు తెలిపారు. ఇవేమీ పట్టించుకోని కేంద్రం కార్పొరేట్లకు లాభం చేకూర్చేలా చర్యలు చేపట్టిందని విమర్శించారు. దీనికి అనుగుణంగా బొగ్గు చట్టాలను సవరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేలా బొగ్గు బ్లాకులను ఆయా సంస్థలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డివిజన్ ఉపాధ్యక్షుడు కొత్త సత్యనారాయణ రెడ్డి, ధర్మపురి,ఐరెడ్డి సంపత్ రెడ్డి, అక్రమ్, అవినాశ్, ప్యారేమియా, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

26మందికి 'కారుణ్య' ఉత్తర్వులు

గోదావరిఖని, జూన్ 25: ఆర్జీ-1 పరిధిలో 26మందికి జీఎం చింతల శ్రీనివాస్ కారుణ్య ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు మంగళవారం అందజేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఇన్ వాలిడేషన్, చనిపోయిన, ఎన్ సీడబ్ల్యూ ఉద్యోగుల డిపెండెంట్లు 26మందికి ఆర్డర్ కాపీలు అందజేశారు. ఇందులో నలుగురు మహిళలు, 22మంది పరుషులు ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఏజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సంతోష్ ఉన్నారు.

ముగిసిన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

పెద్దపల్లిరూరల్, జూన్ 25: పెద్దబొంకూర్‌లోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ మంగళవారం ముగిసింది. దాదాపు 200 మంది పాల్గొనగా 40 మందికి వివిధ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు దక్కినట్లు కళాశాల చైర్మన్ అడవల్లి నవీన్‌కుమార్ తెలిపారు. కళాశాల డైరెక్టర్ నవత, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 25: కుటుంబ కలహాలతో కలత చెంది బైరి సతీశ్(32) ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన బైరి సతీశ్‌కు 2020లో హారికతో వివాహమైంది. వీరికి మూడేళ్ల కూతురు ఉన్నది. రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో విడిగా ఉంటున్నారు. సతీశ్‌పై భార్య పోలీస్టేషన్‌లో కేసు పెట్టగా, భార్యతో విడాకులు కావాలని సతీశ్ కోర్టులో ఫైల్ చేశాడు. కొద్ది రోజుల క్రితం హారిక భర్త వెళ్తానని తెలిపింది. మళ్లీ వారిద్దరి మధ్య గొడవలు జరగడంతో మనస్తాపం చెందిన సతీశ్ గడ్డి ముందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. చికిత్సపొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. తల్లి సరోజన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసునమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు

కాల్వశ్రీరాంపూర్, జూన్25: వెన్నంపల్లి గ్రామానికి చెందిన బియ్యాల మోహన్(27) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాయమల్లు, స్వరూపల కుమారుడు మోహన్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే దవాఖానలో చేర్పించగా, చికిత్స చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో కారు, ఢీ : ఇద్దరికి గాయాలు

యైటింక్లయిన్ కాలనీ, జూన్ 25 : గోదావరిఖని ప్రధాన రహదారిపై ఆటో, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఆటోలో అబ్దుల్ రఫీక్, మునీరొద్దీన్ 8వ కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్తున్నారు. 7ఎల్ఈపీ గని సమీపంలోని ప్రధాన రోడ్డు గోదావరిఖని నుంచి బేగంపేటకు వెళ్తున్న కారు వేగోళపు సత్యనారాయణగౌడ్ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో రెండు పల్టీలు కొట్టగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులను ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటోను ఢీకొట్టిన కారు ఘటనా స్థలం వద్ద ఆపకుండా వెళ్లగా బ్లూకోల్ట్స్ సిబ్బంది వెంబడించి పోతన కాలనీ చౌరస్తాలో అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

27లోగా సర్వీస్ సర్టిఫికెట్ అందజేయాలి

పెద్దపల్లి, జూన్25: స్టాఫ్ నర్సుల పోస్టులకు సర్వీస్ సర్టిఫికెట్ ఈనెల 27 లోగా అందజేయాలని డీఎంహెచ్‌వో కే ప్రమోద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీకి 25 స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, గతంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపాదికన ప్రభుత్వ వైద్యశాలల్లో విధులు నిర్వహించినట్లైతే సంబంధిత అధికారి ధృవీకరించిన సర్వీస్ సర్టిఫికెట్లను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అక్రమ లే అవుట్ రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలి

రామగిరి, జూన్ 25: మంథని సివిల్ కోర్టులో కేసు నడుస్తున్న బుధవారంపేట పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 4/6లో గల 0.19 గుంటల భూమిని అక్రమంగా వెంచర్ చేసి విక్రయాలు జరిపేందుకు సహకరించిన రామగిరి ఎంపీవో, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కలెక్టరేట్‌లో బుధవారంపేట గ్రామస్తులు మూకుమ్మడిగా కలెక్టర్ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు డీటీసీపీ, లే అవుట్ అప్రూవల్ లేకుండా వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ చేశారని, రియల్ ఎస్టేట్ పేరుతో ఇష్టాను సారంగా ఆ భూమిని ప్లాట్లుగా విభజించి అధిక ధరలకు విక్రయిస్తూ గ్రామ పంచాయతీకి నష్టం చేస్తున్నారని ఈనెల 10న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీవో అండదండలతో సదరు వెంచర్ నిర్వాహకులు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆరుగురికి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన సదరు భూమిపై 2017 నుంచి మంథనిలో సివిల్ కోర్టులో కేసు నడుస్తున్నా ఎంపీవో, కార్యదర్శి సహకారంతో విక్రయాలు జరిపినట్లు ఫిర్యాదులో తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆర్డీవోకు ఫిర్యాదు

మంథని, జూన్ 25: మంథని మున్సిపల్ పరిధిలోని గంగపురి సత్యసాయి రైస్‌మిల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు బాధితుడు గొర్రె రమేశ్‌తో కలిసి మంథని ఆర్డీవో హనుమానాయక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. మిల్లు యజమాని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మంథని బొక్కల వాగు నడి మధ్యలో బోరు వేసి నీటిని సత్యసాయి రైస్ మిల్లుకు తరలిస్తూ నీటి చౌర్యానికి పాల్పడుతున్నాడన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు బూడిద గణేష్, సాగర్, వేల్పుల సురేశ్, బావు రవి, యాదవ సంఘం నాయకుడు కన్నెబోయిన కిష్టసామి పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు విడుదల చేయాలి

కమాన్‌పూర్, జూన్ 25: తెలంగాణ ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా వృద్ధాప్య, వికలాంగ, వితంతు, గీత, చేనేత కార్మికులకు ప్రతి నెలా ఇవ్వాల్సిన పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, బొమ్మగాని అనిల్‌గౌడ్, తాటికొండ శంకర్, నీలం శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్, తోట రాజ్ కుమార్ ఒక పత్రిక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాక పోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి, 7 నెలలు గడుస్తున్నా ఇప్పటి దాకా గ్యారంటీలు అమలు చేయలేని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

NAME CHANGE

★I SHAHEEN R/o H.No 1-2-149 Sha Sahab Street Karimnagar TS. Changed My Name As **SYEDA SHAHEEN W/o SYED ALEEMULLAH QUADRI**
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి, జూన్25: వర్షాకాలం దృష్ట్యా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ఇంటి పరిసరాల్లో ఇంట్లో ప్లాస్టిక్ డబ్బాల్లో మురుగునీరు నిల్వకుండా చుడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించరాదని సూచించారు. వర్షాకాలం సమస్యలపై మున్సిపల్ టోల్ ఫ్రీ నంబర్ 63031 27484 కాల్ చేసి ఫిర్యాదు చేస్తే, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు కౌన్సిలర్‌తో వార్డు ఆర్పీ, వార్డు ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్ వార్డు ప్రజలు స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమం పాల్గొనాలన్నారు. మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు...

కలెక్టర్ శ్రీహర్షను మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు కలెక్టర్‌కు మొక్కను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎలిగేడు, జూన్ 25: వర్షాకాలంలో వ్యాధులు దరిచేరకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరినైజేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జే స్వర్ణ, ఎంపీడీవో భాస్కరరావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరీదేవి, గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సౌమ్య, ఆసియా, అభిజిత్, శిరీష, అహ్మద్ మొహియోద్దీన్, సునిత, సదానందం, ప్రత్యూష, వినోద్‌కృష్ణ, వేణు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ధర్మారం,జూన్25: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్